ఈనాడు జగిత్యాల

సోమవారం అక్టోబరు 7, 2024

కూష్మాండ.. శాకంబరి



దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం గాజుల అలంకరణ, కూష్మాండ, శాకంబరి అవతారాల్లో అమ్మవారిని అలంకరించారు. నవదుర్గా క్షేత్రపీఠంలో గులాబీ, చామంతి అర్చన, సాయంత్రం గాజుల అలంకరణ, చండీ హవనం నిర్వహించారు. కనకదుర్గా సేవా సమితి అష్టలక్ష్మి దేవాలయంలో ఉదయం కూష్మాండ రూపంలో సాయంత్రం శాకంబరి అవతారం, విద్యానగర్ జయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

హంస వాహనంపై శ్రీవారి దర్శనం



కోరుట్ల పట్టణంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారు హంస వాహనంపై దర్శనమిచ్చారు. స్థానిక పుర వీధుల గుండా స్వామి వారు ఊరేగగా, భక్తులు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

- న్యూస్‌టుడే, కోరుట్ల

తొలిసారిగా సన్నాల సేకరణ

జిల్లాలో తగ్గనున్న ప్యాక్స్ కేంద్రాలు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:

జిల్లాలో గతంలో ఎన్నడూ లేనట్లుగా రికార్డుస్థాయిలో 3.16 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేయగా రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా సన్నగింజ రకాలను అధికారికంగా సేకరించనుంది. జిల్లాలో వరినూర్పిడులు ప్రారంభంకాగా రెండు, మూడోవారంలో కేంద్రాలను తెరచి కొనుగోళ్లు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.



✦ జిల్లాలో గడచిన యాసంగిలో ప్యాక్స్ ద్వారా 285, ఐకేపీ ద్వారా 133, మెప్మాద్వారా 1 కేంద్రాన్ని ఏర్పాటుచేసి 4.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 5 వేల క్వింటాళ్ల కన్నా తక్కువ కొనుగోలు చేసిన, అధికంగా ఖర్చుచూపిన దాదాపు 34 ప్యాక్స్ కేంద్రాల స్థానంలో ప్రస్తుత సీజనుకు ఐకేపీ ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. ఒక గ్రామంలో ఒకటికన్నా ఎక్కువగా ఉన్న కేంద్రాలను తొలగించటంపైనా అధికారులు సమాలోచన చేస్తున్నారు.

✦ ప్రస్తుతం ఫైన్ రకాలకు క్వింటాలుకు రూ.2,320, కామన్ రకాలకు రూ.2,300 మద్దతు ధరుంది. రాష్ట్రప్రభుత్వం సూచించిన 33 సన్నగింజ రకాలకు మద్దతు ధరకన్నా క్వింటాలుకు రూ.500 అదనంగా ఇచ్చి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దొడ్డుగింజ, సన్నగింజ రకాలను వేరువేరుగా కొనుగోలు చేయాలని నిర్ణయించి 63 వరకు కేంద్రాలలో సన్నాలను సేకరించాలని సంకల్పించారు. రాష్ట్రంలోనే రెండోస్థానంలో జిల్లాలో 421 కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా ఈ సంఖ్య పెరిగే అవకాశముందని సహకారశాఖ జిల్లా అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు.

జిల్లాలో వరిసాగు:
3.16 లక్షల ఎకరాలు
సన్నరకాల సాగు: 86 వేల హెక్టార్లు
సగటు దిగుబడి అంచనా:
6.50 లక్షల మెట్రిక్ టన్నులు
తలపెట్టిన మొత్తం:
సేకరణ కేంద్రాలు: 421
సన్నరకాల సేకరణ కేంద్రాలు: 63
మొత్తం కొనుగోలు అంచనా:
5 లక్షల మెట్రిక్ టన్నులు

✦ గతంలో చాలా గ్రామాల్లో ప్యాక్స్, ఐకేపీ ద్వారా రెండు చొప్పున కేంద్రాలను నిర్వహించారు. నిబంధనల ప్రకారం డీసీఎంఎస్ కేంద్రాల్లో సంస్థ ఉద్యోగులే పనిచేయాలి. కానీ చాలాచోట్ల ప్రైవేటు వ్యక్తులు నిర్వహించటం, జిల్లాలోని పలు ప్యాక్స్‌లు, డీసీఎంఎస్ కేంద్రాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు ఇటీవలే తేలటంతో కేంద్రాల మార్పుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

✦ నిరుడు వానాకాలం జిల్లారైతులు ఉత్పత్తిచేసిన జైశ్రీరాం, హెచ్‌ఎంటీ తదితర సన్నగింజ రకాలకు క్వింటాలుకు బయటి మార్కెట్లో రూ.2,800 నుంచి రూ.3,300 వరకు ధరలు పలికాయి. ఈ సీజన్‌లో జిల్లాలో సన్నగింజ రకాలను అధికంగా సాగుచేసినా బయటి మార్కెట్లో ప్రభుత్వం చెల్లించే మద్దతుధర, బోనస్(రూ.2,820) కన్నా అధికంగా ఉన్నట్లయితే రైతులు నేరుగా విక్రయించే అవకాశముంటుంది. గత సీజన్లలో ప్రభుత్వ బియ్యం తీసుకుని సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లు బయటి మార్కెట్లో లేదా రైతులనుంచి అధిక ధరకు నేరుగా ధాన్యాన్ని కొని సీఎంఆర్ చెల్లించారు. ఈ సీజన్‌లోనూ పలువురు మిల్లర్లు సీఎంఆర్ బకాయి ఉండటంతో నేరుగా ధాన్యాన్ని కొనే అవకాశముంది.

గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

- జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ప్రభుత్వం సన్నగింజ రకాలను కొనుగోలు చేయనున్నందున లావుగింజ, సన్నగింజ రకాలను గుర్తించేలా గ్రెయిన్ కాలిపర్స్, డయల్ మైక్రోమీటర్లను వినియోగించనున్నాము. రకాల గుర్తింపులో ఏఈవోలు జాగ్రత్తలు తీసుకోవాలి. సేకరించిన సన్నధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు పంపిస్తాం. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాము.

అభివృద్ధి చేయరు.. నిషేధం తొలగించరు

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అయోమయంలో బాధితులు

న్యూస్‌టుడే, ధర్మపురి

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లోని వారు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇళ్లను, స్థలాలను ప్రభుత్వం ఏళ్ల తరబడి నిషేధిత జాబితాలో ఉంచడంతో నూతన గృహాలు కట్టుకోలేక.. స్థలాలు అమ్ముకోలేకపోతున్నామని వాపోయారు. 2016లో దేవాదాయ శాఖాధికారులు ధర్మపురి ప్రధాన ఆలయంతో పాటు, క్షేత్రాన్ని అభివృద్ధి పరచేందుకు ఆర్‌సీ నంబర్ 15/2016 ద్వారా మొత్తం **50** ఇళ్లు, ప్రైవేటు వ్యక్తుల స్థలాలను సేకరించారు. రెవెన్యూ అధికారుల సర్వే ద్వారా అప్పటి కలెక్టర్ **50** గృహాలు, ఇతర స్థలాలపై నిషేధం విధించారు. దేవస్థానం అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులు 2018లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం రూ.46 కోట్ల నిధులు మాత్రమే విడుదల చేసింది. అయినా వీటిలో ఒక్క రూపాయిని అధికారులు ఖర్చు చేయలేదు.



ఆలయ పరిసర ప్రాంతాల్లోని నిషేధిత జాబితాలోని ఇళ్లు

అనుమతులు లేకుండానే..

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇళ్లను, ఖాళీ స్థలాలను నిషేధిత జాబితాలో ఉంచడంతో వాటిని తొలగించాలని బాధితులు కార్యాలయాల చుట్టు తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేదు. ఆలయాన్ని అభివృద్ధి పరచకుండా.. తమ ఇళ్లను నిషేధిత జాబితాలో ఉంచడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా నిషేధం కొనసాగిస్తున్నారని వాపోయారు. దేవస్థానం అభివృద్ధి పేరుతో తమ ఇళ్లను అనుమతులు లేకుండా, నోటీసులు ఇవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఆలయానికి దూరంగా ఉన్న ఇళ్ల వివరాలను సైతం అధికారులు నిషేధిత జాబితాలో ఉంచారు. నిషేధిత జాబితాలోంచి తొలగించాలని పలువురు కోర్టులను ఆశ్రయించారు.

త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం

- శ్రీనివాస్, ఈవో

నిషేధిత జాబితా సమస్యపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కోర్టులో ఉన్న కేసులన్నీ చివరి దశలో ఉన్నాయి. ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తాం.

నిషేధిత జాబితాల్లోంచి అన్ని ఇళ్లను తొలగించాలి



నందగిరి గిరిధర్, ధర్మపురి

ఈ విషయాన్ని గత ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. నూతన ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా.. రుణం పొందాలన్నా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఆలోచించి వెంటనే నిషేధిత జాబితాలోంచి అన్ని ఇళ్లను తొలగించాలి.

బ్యాంక్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు



కాసం శ్రీనివాస్, బాధితుడు, ధర్మపురి

ఏళ్ల తరబడి ఈ సమస్య పెండింగులో పెడుతున్నారు. అధికారుల నిర్ణయాలతో తామంతా వీధిన పడే పరిస్థితి నెలకొంది. ఇంటిపై రుణం ఉండటంతో బ్యాంకర్లు కూడా ఇబ్బంది పెడుతున్నారు.

ఇంటిని విక్రయించే పరిస్థితి లేదు



నారాయణ, ధర్మపురి

దేవస్థానం పరిసర ప్రాంతంలో నలభై ఏళ్ల కిందటే ఇంటిని కొనుగోలు చేశాను. ఆర్థిక ఇబ్బందుల తరుణంలో అధికారులు ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చడంతో విక్రయించే పరిస్థితి లేదు.

పల్లె ప్రకృతివనమే!

మండల పరిషత్ చౌరస్తా సమీపంలోని పల్లె ప్రకృతి వనాన్ని అధికారులు గాలికొదిలేశారు. చిన్నారుల కోసం ప్రకృతివనంలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు మూలనపడ్డప్పటికీ వాటిని మరమ్మతు చేయించడంలేదు. ఎప్పుడూ పార్కు గేట్లు తెరచి ఉంచడంతో అందులో వాహనాల మరమ్మతు చేసుకుంటుండటంతో గ్యారేజ్‌గా మారిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మల్యాల



స్కేటింగ్‌లో చిన్నారి ప్రతిభ

జగిత్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో జగిత్యాలకు చెందిన అమృత వర్షిణి ప్రథమస్థానంలో నిలిచింది. భువనగిరిలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. కర్నాటకలోని మైసూరులో డిసెంబర్‌లో జరిగే 7 ఏళ్ల లోపు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది. మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రామారావు కుమార్తె అమృత వర్షిణి చిన్నప్పటి నుంచే స్కేటింగ్‌లో శిక్షణ పొందింది.



ప్రథమస్థానం పొందిన అమృత వర్షిణి

రాష్ట్ర స్థాయిలో రజత పతకం

వెల్గటూరు, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లాలోని కోస్గిలో ఈనెల 5వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో చెగ్యాం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎస్.విజయ, ఎ.అక్షయ, ఆర్.త్రిషణ్య అనే ముగ్గురు విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బృందానికి ప్రాతినిధ్యం వహించి రజత పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మహేశ్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాద మలుపులు



రాయికల్ మండలంలోని చింతలూరు-బోర్నపల్లి అటవీ ప్రాంత రహదారిలో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మూల మలుపుల వద్ద చెట్ల కొమ్మలు రహదారిని ఆక్రమించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్మల్-జగిత్యాల జిల్లాల అనుసంధానికి బోర్నపల్లి వారధి కీలకం కాగా నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. చింతలూరు-బోర్నపల్లి రహదారి విస్తరణకు నిధులు వంతెన నిర్మాణ సమయంలోనే మంజూరు కాగా అటవీ అనుమతులు రాక సుమారు ఆరు కి.మీ. రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలని జగిత్యాల, నిర్మల్ జిల్లా వాసులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, రాయికల్

రహదారులకు మరమ్మతు కరవు

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్యాల గ్రామం నుంచి అడ్డరోడ్డుకు వెళ్లే రహదారి పలు చోట్ల గుంతలు పడటంతో ప్రమాదాల బారి నపడుతున్నట్లు వాహనచోదకులు పేర్కొంటున్నారు. రామన్నపేట నుంచి గొల్లపల్లె, రాంపూర్ వెళ్లే రహదారి మధ్య లోతైన గుంతలు ఏర్పడటంతోపాటు పలుచోట్ల రోడ్డు కోతకు గురైంది. రామన్నపేట నుంచి నూకపల్లి ఆదర్శ పాఠశాల మీదుగా జాతీయ రహదారి వరకు పలు చోట్ల శిథిలమైంది. మల్యాల నుంచి పెగడపల్లి మండల కేంద్రానికి ఏడాది కిందట రూ.20కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో కంకరరోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారులపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేయించాలని మండలవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మల్యాల(రామన్నపేట)



మల్యాల మండల పరిషత్ సమీపంలో రహదారి దుస్థితి



రామన్నపేట నుంచి రాంపూర్ వెళ్లే రహదారిపై గుంతలు

పొంచి ఉన్న ప్రమాదం



మెట్‌పల్లి రాంనగర్‌లోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రహరీ కింద మట్టికొట్టుకుపోయి పెద్ద గుంతలా ఏర్పడింది. గోడ బయట మురుగు కాల్వ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. గోడ పక్కనే విద్యార్థుల మూత్రశాలలు ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

మరింతగా తగ్గిన లబ్ధిదారులు

- 17వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ పీఎంకిసాన్ సమ్మాన్ నిధి పథకం 17వ విడత నిధులను ఈ నెల 5న విడుదల చేసింది. పథకంలో చేరేందుకు జిల్లాలోని వేలాదిమంది రైతులు అయిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2019 ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీగా నిర్ణయించి అంతకుముందు రెవెన్యూ జాబితా ప్రకారం రైతులను పథకంలో నమోదు చేయగా తదుపరి రైతుల నమోదుకు అవకాశమివ్వటంలేదు. వారసత్వ బదలాయింపు, నూతనంగా భూములు కొనుగోలు చేసినవారు పెద్ద సంఖ్యలో ఉండగా వీరికి చోటు కల్పించాల్సింది పోయి పాత వారినీ జాబితాలో నుంచి తొలగిస్తున్నారు. ఒక్కో రైతుకు ఏటా మూడు దఫాలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు ఇస్తున్నారు. ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబరు, డిసెంబరు-మార్చి విడతలుగా నిధుల బదిలీ చేపడుతున్నారు. కొందరు ఈకేవైసీని పూర్తిచేసినవారికీ నిధులు నిలిచిపోతుండగా పూర్తిచేయనివారికి, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేనివారికి నిధులందటం లేదు. రేషన్‌కార్డుల ఆధారితంగా కుటుంబంలో ఒకరినే పరిగణనలోకి తీసుకోవటం, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, రిటర్న్స్ దాఖలు చేస్తున్నవారిని క్రమంగా పథకంలోనుంచి తొలగిస్తున్నారు. జిల్లాలో 55 వేల మంది నూతన రైతులకు అవకాశం కల్పించాల్సి ఉంది. దీనిపై డీఏవో రాంచందర్ వివరిస్తూ ప్రభుత్వం అనుమతిస్తే నూతన రైతులను జాబితాలో నమోదు చేస్తామన్నారు.

జిల్లాలో నిధులందిన రైతులసంఖ్య


విడత	రైతులు
1	1,45,537
2	1,43,166
3	1,41,655
4	1,39,786
5	1,39,314
6	1,38,005
7	1,35,484
8	1,34,219
9	1,33,199
10	1,31,091
11	1,24,891
12	1,11,632
13	1,01,165
14	94,279
15	71,140
16	70,031
17	68,382

శ్రీహరి గానామృతం గ్రంథావిష్కరణ

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్రాహ్మణ సంఘం భవనంలో ఆదివారం రాత్రి ప్రముఖ కవి నరహరి రచించిన 'శ్రీ హరి గానామృతం' గ్రంథాన్ని జిల్లాలోని చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్ ఆవిష్కరించారు. ఈ గ్రంథంలో పొందుపరచిన పలు అంశాలు, ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం గూర్చి పలువురు ప్రసంగించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండి రాంకుమార్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు ఊరట కలిగేనా!

- రాష్ట్రంలో కొత్తగా శస్త్రచికిత్స కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు ఎదురుచూపులు



ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే గోదావరిఖని పట్టణం

కిడ్నీ రోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రక్తనాళాల శస్త్రచికిత్స(వాస్క్యులర్ సర్జరీ), డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఉండగా.. 150 పడకల వరకు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 11,250 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా ప్రత్యేక వాస్క్యులర్ సర్జన్లు లేరు. నెఫ్రాలజిస్టు స్పెషలిస్టులు సైతం అందుబాటులో లేరు. కేవలం రోగులకు డయాలసిస్ యంత్రాల ద్వారా రక్తశుద్ధీకరణ మాత్రమే జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలు-రోగుల వివరాలు

జిల్లా	ఆసుపత్రులు	పడకలు	రోగుల సంఖ్య
కరీంనగర్	4	45	5,210
పెద్దపల్లి	3	15	2,120
జగిత్యాల	3	50	2,450
సిరిసిల్ల	2	40	1,470




పెద్దపల్లి జిల్లాసుపత్రి డయాలసిస్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

గాంధీ, నిమ్స్‌కు వెళ్లాల్సిందే..

కిడ్నీ బాధితులకు తొలిసారి రక్తశుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు డయాలసిస్ యాక్సెస్ పాయింట్ ఏర్పాటుకు వాస్క్యులర్ సర్జరీ అవసరమవుతుంది. శరీరంలోని రక్తాన్ని 4 గంటలపాటు అన్ని అవయవాలకు ప్రవహించేలా ఈ శస్త్రచికిత్స చేస్తారు. ఇలాంటి చికిత్సలు హైదరాబాద్‌లోని గాంధీ, నిమ్స్ ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు వ్యయ ప్రయాసలతో హైదరాబాద్‌కు వెళ్లి చేయించుకోవాల్సి వస్తుంది. చికిత్స అనంతరం ఆయా జిల్లాల్లోని డయాలసిస్ కేంద్రాల ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా రెండు రోజులకొకసారి 4 గంటలపాటు రక్తం శుద్ధి చేసుకుంటున్నారు.

రక్త శుద్ధీకరణ ఇలా..



✦ మధుమేహం, మద్యపానం, జన్యుపరమైన లోపాల మూలంగా మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. రక్తశుద్ధీకరణ సాఫీగా జరగకపోవడంతో ప్రాణాప్రాయ పరిస్థితులకు రోగి చేరుకునే అవకాశం ఉంటుంది. దీంతో వెంటనే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. గుండెకు తీసుకెళ్లే, తీసుకొచ్చే రక్తనాళాల మార్గాన్ని కలుపుతూ శస్త్రచికిత్స చేసి.. రక్తం శుద్ధిచేసే వైపులకు అనుసంధానం చేస్తారు. తద్వారా రోగి రెండు రోజులకొకసారి డయాలసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. హృదయ స్పందన సజావుగా సాగేందుకు.. ధమనులు, సిరలకు రక్త శుద్ధీకరణ సాఫీగా జరిగేందుకు యంత్రాల ద్వారా పర్యవేక్షణ చేస్తారు.

✦ కిడ్నీలకు వెళ్లే రక్తనాళాలకు సమస్యలుంటే మోచేయి కింద మణికట్టుకుపైన శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏ ప్రభుత్వాసుపత్రులోనూ ప్రత్యేకంగా వాస్క్యులరీ సర్జన్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✦ ఎండో వాస్క్యులరీ సిస్టం వంటి అత్యాధునిక రక్తనాళాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ సేవలు రోగులకు అందడం లేదు. ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు(నెఫ్రాలజిస్టులు) కూడా అందుబాటులో లేరు. అన్ని డయాలసిస్ కేంద్రాల్లోనూ కేవలం యంత్రాల టెక్నీషియన్లు, నర్సులు, ఇతర సిబ్బంది తప్ప వైద్య చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు అందుబాటులో లేరు.

లక్ష్యం.. ప్రణాళిక.. సాధన..


◆ డీఎస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్ల మనోగతం

విజేతల గెలుపు సూత్రాలివి

'విజేతలు భిన్నమైన పనులు చేయరు.. అందరూ చేసే పనులనే వైవిధ్యంగా చేస్తారు..' అని అంటారు ప్రముఖ ఆంగ్ల రచయిత శివ్‌ఖేరా. అందరికీ ఉన్న సమయమే తమకూ ఉన్నా కొందరు దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేలల్లో ఒకడిగా కాకుండా, అందరిలోనూ ప్రథముడిగా నిలవాలన్న లక్ష్యంతో ఎంచుకున్న రంగంలో మేటిగా నిలుస్తున్నారు.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

వారంతా లక్ష్యం నిర్దేశించుకున్నారు. సాధన కోసం కఠోరంగా శ్రమించారు. పాఠ్య పుస్తకాలనే నేస్తాలుగా మలచుకున్నారు. అపజయాలనే పాఠాలుగా చేసుకున్నారు. ప్రణాళిక, లక్ష్యం, పునశ్చరణ, స్వీయ మూల్యాంకనం.. ఇవే తమ గెలుపు సూత్రాలని చెబుతున్నారు. ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులు తమ సన్నద్ధత తీరును 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



ప్రతి పాఠానికీ స్వీయ పరీక్ష



ఉన్నది ఒకే పోస్టు, ప్రతి రోజూ రేపే ఫైనల్ పరీక్ష ఉన్నట్లు భావించా. ఉద్యోగానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి ఎలాగైనా సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఏరోజూ సమయాన్ని వృథా చేయలేదు. అవసరమైన ప్రణాళిక వేసుకొని సన్నద్ధమయ్యా. ఒక్కో రోజు రెండు, మూడు గంటలే నిద్రపోయాను. ఆన్‌లైన్‌లో పాఠాలు విన్నా. ప్రతి పాఠానికి స్వీయ పరీక్ష పెట్టుకొని తప్పులు లేకుండా సాధన చేశా. సబ్జెక్టుకు సంబంధించిన అంశాలపై మిత్రులతో చర్చించా. క్వశ్చన్ బ్యాంకు జోలికి వెళ్లలేదు. సాధన, పునశ్చరణతోనే మంచి ఫలితం వస్తుందని నమ్మాను. రెండు నెలల కిందట గురుకులంలో పీజీటీగా విధుల్లో చేరా. భర్త శ్రీనివాస్ సహకారంతోనే రెండు కొలువులు సాధించగలిగా.

– సుభద్ర, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, భద్రిపల్లి, అంతర్గాం మండలం

ఓటమి నేర్పిన విషయాలెన్నో..



ఓటమి నా జీవితాన్ని మలుపు తిప్పింది. గతంలో ఒకసారి డీఎస్సీ, మూడు సార్లు గురుకుల ఉపాధ్యాయ పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. అయినా నిరాశ చెందలేదు. మానసిక ఒత్తిడికి గురి కాలేదు. ఈసారి రోజుకు 10 గంటల పాటు సన్నద్ధమయ్యా. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదివా. అందులోని సాహిత్యంపై పట్టు పెంచుకున్నా. ప్రతి పాఠానికీ నోట్స్ సిద్ధం చేసుకొని కఠినమైన అంశాలను గుర్తుంచుకునేలా సాధన చేశా. అర్థం కాని విషయాలపై ఆన్‌లైన్‌లో శోధించి సందేహాలు నివృత్తి చేసుకున్నా. సైకాలజీ, మెథడాలజీని అర్థం చేసుకున్నా. కవులు, సాహితీవేత్తలకే పరిమితం కాకుండా కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జిపై దృష్టి పెంచాలి.

– కృష్ణ వేముల, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, గోదావరిఖని

అర మార్కు మలుపు తిప్పింది



గత డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం దూరమవడం నా జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. వచ్చేసారి ఎలాగైనా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. పొరపాట్లు సరిదిద్దుకున్నా. పట్టుదలతో సన్నద్ధమయ్యా. పగలు మొత్తం జిల్లా గ్రంథాలయంలోనే గడిపా. కీలక అంశాలు, సమాచారంపై స్నేహితులతో కూలంకుశంగా చర్చించా. ప్రతి అంశాన్ని రాసుకున్నా. పోటీ పరీక్ష అంటే మొదట భయం వీడాలి. ఇన్నాళ్లూ చదివిన అంశాలపై తడబడకుండా పరీక్ష రాయాలి. కుటుంబ సభ్యుల సహకారంతో కొలువు సాధించా.

– నీరటి శ్రీనివాస్, ఎస్జీటీ, కదంబాపూర్, సుల్తానాబాద్ మండలం

మూడు సార్లు స్వల్ప మార్కులతో దూరం



గతంలో మూడు సార్లు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరైనా స్వల్ప మార్కులతో ఉద్యోగాలు కోల్పోయా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రతతో సన్నద్ధమయ్యా. రోజుకు 6 గంటల పాటు కఠిన సాధన చేశా. గ్రంథాలయానికి వెళ్లి సిద్ధమయ్యా. 6 నుంచి 12వ తరగతి వరకు పుస్తకాల్లోని ప్రతి అంశాన్నీ రాసుకున్నా. వివిధ పబ్లికేషన్లకు సంబంధించిన పుస్తకాలు చదివా. రేఖాగణితం, క్షేత్రమితి, సంఖ్యామానం, త్రికోణమితిలపై పట్టు పెంచుకునే భావనలను గుర్తుంచుకున్నా. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకున్నా.

– లట్ట శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ గణితం, గోపాల్‌పూర్, మంథని మండలం

ఒక్క పోస్టున్నా నాదే కావాలనుకున్నా



బయోసైన్స్‌లో ఒక్క పోస్టున్నా మొదటి ర్యాంకుతో అది నాదే కావాలి.. అని లక్ష్యంగా పెట్టుకొని చదివా. గతంలో ఒకసారి డీఎస్సీ రాసినా ఉద్యోగం రాకపోవడంతో కొంత నిరాశకు గురయ్యా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని క్రమశిక్షణ, ప్రణాళికతో సన్నద్ధమయ్యా. పట్టు వదలకుండా రోజుకు 12 గంటల పాటు శ్రమించా. కంటెంట్, మెథడాలజీ, విద్యా దృక్పథాలు, సైకాలజీపై ఎక్కువగా దృష్టి పెట్టా. 6 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో లైన్ టు లైన్ చదువుతూ నోట్స్ రాసుకున్నా. ప్రతి పాఠానికి సొంతంగా పరీక్ష పెట్టుకొని తప్పులు దిద్దుకున్నా. భర్త మునీంద్ర, మా అమ్మ రీనాకుమారి ప్రోత్సాహంతో లక్ష్యం సాధించా.

– గడదాస్ ప్రణీత, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, రామగుండం

పాఠ్యాంశాలను జీవితానికి అన్వయించుకున్నా



గతంలో రెండు సార్లు డీఎస్సీ రాసినా నిరాశే ఎదురైంది. అప్పుడు చేసిన పొరపాట్లను మననం చేసుకొని వాటినే సవాళ్లుగా తీసుకున్నా. ప్రయత్న లోపాలు తెలుసుకున్నా. క్రమశిక్షణగా రోజుకు 12 గంటల పాటు సన్నద్ధమయ్యా. పాఠ్య పుస్తకాలు, దినపత్రికల్లో వచ్చే సమాచారాన్ని క్రమం తప్పకుండా అనుసరించా. బట్టీ పట్టే విధానం కాకుండా పాఠ్యపుస్తకాల్లోని అంశాలను నిత్య జీవితానికి అన్వయించుకున్నా. సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానంలో కొంత సమాచారం అందుబాటులో ఉండదు. అందుకే పాత పుస్తకాల్లోని అంశాలను క్రోడీకరించి నోట్స్ సిద్ధం చేసుకున్నా. వీలైనన్ని ఎక్కువ సార్లు మననం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఫిజిక్స్ అనే ఫోబియాను మనసులో తొలగించుకొని సాధన చేస్తే మిగతా సబ్జెక్టుల కంటే ఇది చాలా సులువు.

– శీలం దేవేందర్, స్కూల్ అసిస్టెంట్, భౌతికశాస్త్రం, వెళ్లాస్‌పూర్, మంథని మండలం

సమస్యల వలయంలో శాతవాహన

శాశ్వత ఉపకులపతి లేక నిర్ణయాల్లో జాప్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆందోళన (పాతచిత్రం)

విశ్వవిద్యాలయాలు.. విద్యార్థుల మేధోశక్తికి పదును పెడుతూ వారిని భావి భారత పౌరులుగా తీర్చిద్దాల్సిన ప్రాంగణాలు.. విద్యార్థి శక్తిని దేశానికి ఉపయోగపడేలా చేయాల్సిన విద్యా కర్మాగారాలు.. అలాంటివి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం సమస్యలకు లోగిలిగా మారింది. మే 21న గత ఉపకులపతి పదవి ముగిసింది. ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఐఏఎస్ సురేంద్రమోహన్ నాలుగు నెలలుగా కొనసాగుతున్నారు.

విజిలెన్స్ విచారణ

విశ్వవిద్యాలయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తూ సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా.. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెండు నెలలుగా వర్సిటీలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. శాశ్వత ఉపకులపతిని నియమించాలని కోరుతూ, విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిపించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు దఫాలుగా ఆందోళనలు చేస్తూ.. ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు సమర్పిస్తున్నారు.

■ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేయటంలేదు. వందలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. పేరుకు మాత్రమే విశ్వవిద్యాలయంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

■ ఏటా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సంఖ్య పెంచటానికి ప్రయత్నం చేయాలి. కానీ వాటి జాడే లేదు.

■ పాలక మండలి(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)గా పిలిచే శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి పాలక మండలి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక, ఉన్నత, డిగ్రీ విద్య కమిషనర్లు, కార్యదర్శులతోపాటు ఎస్‌యూ వీసీ సభ్యుడిగా ఉండే తాత్కాలిక కార్యనిర్వాహక మండలి మాత్రమే కొనసాగుతోంది.

■ ఇన్‌ఛార్జి ఉపకులపతి నాలుగు నెలల కిందట వచ్చారంటే.. మళ్లీ ఇటీవల విశ్వవిద్యాలయానికి వచ్చారు. ప్రభుత్వ శాఖల పనుల నిర్వహణలో తీరిక లేకపోవటంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఏ సంతకం అవసరమైనా, ఏ ప్రతిపాదన ఆమోదానికైనా విశ్వవిద్యాలయం సిబ్బంది హైదరాబాద్‌కు వెళ్లి సంతకం తీసుకొస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే చరవాణిలో సంప్రదిస్తూ నిర్ణయం తీసుకుంటున్నాం. శాశ్వత వీసీ త్వరలో వచ్చే అవకాశముంది. **- ఆచార్య వరప్రసాద్, రిజిస్ట్రార్, శాతవాహన విశ్వవిద్యాలయం**

■ విధానపరమైన, అభివృద్ధి పనుల నిర్ణయాలు తీసుకోవటంలో జాప్యం జరుగుతోంది. బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలతోపాటు విద్యార్థి పరిశోధకుల సమస్యలు పరిష్కారం కావటంలేదు.

■ శాశ్వత ఉపకులపతులు ఇదిగో, అదిగో వస్తున్నారని ప్రభుత్వం ఊరడింపు ప్రకటనతో సరిపుచ్చుతోంది. సమస్యల పరిష్కారం జాప్యం చోటు చేసుకుంటుంది.

ఎస్సారెస్పీకి 21 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 21,590 క్యూసెక్కుల వరద వస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మధ్యమానేరుకు తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్ ఉత్పత్తికి 6,800, ఎస్కేప్ గేట్లద్వారా గోదావరిలోకి 1,200, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091 అడుగుల నీటిమట్టం ఉంది.

స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతం

పొలంలో పడి సహాయ లైన్‌మెన్ మృతి



నరేశ్

మానకొండూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభంపై మరమ్మతు చేస్తున్న ఉద్యోగి విద్యుదాఘాతంతో కింద పడి మృతి చెందడం ఆదివారం మానకొండూర్ మండలం కెల్లేడు శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన జోగి నరేశ్(37) మూడున్నరేళ్లుగా కొండపల్కల క్లస్టర్‌లో సహాయ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. కెల్లేడు శివారులోని వరి పొలంలో విద్యుత్తు స్తంభంపై ఇన్సులేషన్ మరమ్మతు కోసం ఆదివారం ఆయన సబ్‌స్టేషన్‌లో ఎల్సీ తీసుకొన్నారు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్తు సరఫరా కావడంతో కింద పడ్డారు. కింద వరి పొలంలో తల బురదలో కూరుకుపోయి ఊపిరి ఆడక మృతి చెందారు. ఘటన జరిగిన సమయంలో నరేశ్ మినహా అక్కడ ఎవరూ లేరు. కింద పడిన వెంటనే బురద నుంచి బయటకు తీస్తే ప్రాణాలు దక్కేవని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, పదేళ్లలోపు కుమారుడు, కూతురున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ జట్టు విజయం

చైతన్యపురి, న్యూస్‌టుడే: వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మధ్య ఆదివారం వరంగల్‌లోని ఫాతిమా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కరీంనగర్ న్యాయవాదుల జట్టు గెలుపొందినట్లు స్పోర్ట్స్ సెక్రెటరీ మడిపల్లి రవి తెలిపారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకున్న వరంగల్ జట్టు 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ న్యాయవాదుల జట్టు 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. గెలుపొందిన జట్టు న్యాయవాదులను బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



గెలుపొందిన న్యాయవాదుల జట్టు సభ్యులు

షాట్‌పుట్‌లో అక్కాచెల్లెళ్లు అదుర్స్

న్యూస్‌టుడే, ఓదెల



రాష్ట్ర స్థాయిలో ఆరు సార్లు

చిన్నతనం నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. బడిలో జరిగిన ఆటల పోటీల్లో నా ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు షాట్‌పుట్‌లో ప్రోత్సహించారు. ప్రత్యేక శిక్షణ ఇస్తూ మెలకువలు నేర్పించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇంటికి సమీపంలోనే ఉన్న పాఠశాల మైదానంలో సాధన చేస్తున్నాను. గతేడాది బిహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడాను. అలాగే ఖమ్మం, మెదక్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లలో జరిగిన పోటీల్లో ఆరు మార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల గోదావరిఖని ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 7, 8 తేదీల్లో హనుమకొండలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ముస్ముందు అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. **- శ్రావ్యశ్రీ, తొమ్మిదో తరగతి**

ఆటలపై ఇష్టంతో అక్క మెలకువలు నేర్చింది.. ఆమె స్ఫూర్తితో చెల్లెలు సాధన మొదలుపెట్టింది.. క్రీడల్లో పతకాలు సాధిస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతున్నారా సోదరీమణులు. ఓదెల మండలం కొలనూరుకు చెందిన రేండ్ల రాజేందర్, శ్రీహర్ష దంపతుల కూతుళ్లు శ్రావ్యశ్రీ, సౌమ్యశ్రీ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు. రాజేందర్ కారు నడుపుతూ, శుభకార్యాలకు వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన ఆయన కూతుళ్ల ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మెలకువలు నేర్పించారు.

ఉదయం సాయంత్రం సాధన



అక్కయ్య స్ఫూర్తితో ఆటలపై ఆసక్తి పెంచుకున్నా. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం పాఠశాల ముగియగానే గంట పాటు వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో సాధన చేస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేలా అమ్మానాన్న మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మేం తీసుకునే ఆహారంలోనూ జాగ్రత్తలు పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో రెండు సార్లు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆడాను. గతేడాది భద్రాచలంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచా. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ఆడాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నదే లక్ష్యం.

- రేండ్ల సౌమ్యశ్రీ, ఎనిమిదో తరగతి

ఆర్టీసీ బస్సు ఢీకొని

ఒప్పంద కార్మికుడి దుర్మరణం



లక్ష్మయ్య

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒప్పంద కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వేముల లక్ష్మయ్య(58) బసంత్‌నగర్‌కేశోరాం సిమెంట్ పరిశ్రమలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం భార్య మల్లీశ్వరితో కలిసి ద్విచక్రవాహనంపై దేవునిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శనానికి వెళ్తున్నారు. అందుగులపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గాయపడ్డ మల్లీశ్వరిని పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి చెప్పారు.

ఆరుతడికి ఊతమేది!

ఈ నెల నుంచి యాసంగి సీజను ఆరంభం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

దశాబ్దం కిందటి వరకు ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట పత్తి, మక్క, పసుపు తదితర అన్ని పైర్లను దాటుకుని ప్రస్తుతం కేవలం వరివిస్తీర్ణం గణనీయంగా పెరిగి పంటలవైవిధ్యం దెబ్బతింటోంది. ఈ నెల నుంచి యాసంగి మొదలుకానున్న తరుణంలో ప్రభుత్వ ప్రోత్సాహం దీర్ఘకాలికంగా ఆరుతడికి ఊతమివ్వనుంది.

■ ఆరుతడి పంటల సాగుకు కూలీల కొరత, మద్దతు ధరకు సేకరించకపోవటం, మార్కెటింగ్ సమస్య, కోతులు, నెమళ్లు, అడవిపందులు తదితర వన్యప్రాణుల బెడద, విత్తన రాయితీని, ఆరుతడి పైర్లకు ఉపకరించే బిందుసేద్య రాయితీని ఎత్తివేయటంతో పాటు సాగునీటి లభ్యత పెరగటం తదితర కారణాలతో రైతులందరూ వరివైపే మళ్లారు.


■ జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో రాష్ట్రంలోనే వరి, నువ్వులపై అత్యధిక పరిశోధనలు సాగుతున్నాయి. పొలాసలో వేరుసెనగ, పత్తి, కంది, చెరకు తదితర అన్నిరకాల ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపడితే ద్వారా మన ప్రాంత నేలలకు అనువైన అధిక దిగుబడి వంగడాల రూపకల్పన సాధ్యపడుతుంది. ఇటీవల జగిత్యాల జిల్లాలో ఆవాలసాగు గణనీయంగా పెరుగుతున్నందున కేంద్రం ప్రకటించినట్లు పొలాస పరిశోధనస్థానంలో ఐసీఏఆర్ ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పరచాలి.

■ ఐసీఏఆర్ కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంటలో ఉండగా ఇక్కడ పూర్తిస్థాయి పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. సెనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితరాల్లో మేలైన వంగడాలను రూపొందించటం, ఆరుతడి పంటల్లో దిగుబడులు పెరిగి చీడపీడలు, కలుపు నివారణ రసాయనాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెచ్చినట్లయితే నల్లరేగటి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల రైతుల క్రమంగా వీటిసాగును పెంచుతారు. పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

■ పెద్దపల్లి జిల్లా కూనారం వరి పరిశోధనస్థానంలో పలు ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపట్టాలి. కరీంనగర్ పరిశోధనస్థానంలో కేవలం మొక్కజొన్న పైనే పరిశోధనలు సాగుతుండగా మన రైతులు పండించే, స్థానిక నేలలకు అనువైన పంటలపై పరిశోధనలను చేపట్టి చేపట్టి తెలంగాణ సీడ్స్ ద్వారా రైతులకు రాయితీపై అన్నిరకాల విత్తనాలను ఇచ్చినట్లయితే రైతులకు ప్రోత్సాహకంగా ఉంటుంది.




పంట	2014	2024
వరి	6,08,321	9,82,687
పత్తి	5,03,402	1,69,013
మక్క	85,739	41,259
కంది	21,547	11,515
నువ్వులు	15,064	29,297
మామిడి	65,373	73,741
పసుపు	42,546	30,430
ఇతర పూలు, పండ్లు, మిరప, కూరగాయలు	22,549	42,562



ఆవాల పైరు

పంట మార్పిడి పాటించాలి



వరి స్థానంలో మరోపంటగా ఆరుతడిని పండిస్తే పంటల సరళి, నేలస్థితిగతులు మెరుగుపడతాయి. నేలలు, నీటిలభ్యత, కూలీలు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ చూసుకుని రైతులు పంటమార్పిడి పాటించాలి.

- డాక్టర్ జి.శ్రీనివాస్, సహపరిశోధన సంచాలకులు

■ జగిత్యాల చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధస్థానాన్ని ఏర్పాటు చేసినట్లయితే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, ఇతర సీతాఫల్, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూలసాగును చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. జగిత్యాల మామిడి మార్కెట్లో శాశ్వత పండ్ల మార్కెటును ఏర్పాటుచేస్తే రైతులకు ఏడాది పొడవునా విక్రయ అవకాశాలుంటాయి.

■ నాలుగు జిల్లాల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలను పెద్దఎత్తున నాటుతుండగా స్థానికంగా గానుగ పరిశ్రమలను నెలకొల్పాలి. జిల్లాలో యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో రైతులు విత్తనోత్పత్తి చేపడుతున్నందున విత్తనోత్పత్తి పైర్లసాగును పెంచేలా ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసేలా చూడాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని అందుబాటులోకి తేవాలి.

■ ప్రభుత్వం హామీఇచ్చినట్లు ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. వెల్గటూరు, మల్లాపూర్ మండలాల్లో తలపెట్టిన ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేస్తే రైతులకు విక్రయ అవకాశాలు దరిచేరి ఆరుతడి పంటలకు మళ్లుతారు. నిజామాబాద్‌లోని పడిగెల్ వద్ద తలపెట్టిన స్పైసెస్ పార్కును పూర్తిచేస్తే ఉద్యాన పంటల రైతులకు ధీమాగా ఉంటుంది.

■ పొలాస పరిశోధన స్థానంలోని ఇంక్యూబేషన్ సెంటర్ ద్వారా యువరైతుల ఆవిష్కరణలను ప్రోత్సహించాలి, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి యూనిట్లను, చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పేలా రాయితీలనివ్వాలి. పాలీహౌజులు, ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, యంత్రపరికరాల రాయితీని పునరుద్ధరించాలి. పంటలబీమాను యాసంగి నుంచి అమలుచేయాలి. విపణిలో ధరతగ్గిన ఉత్పత్తులను మార్కెట్‌జోక్య పథకం ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేస్తే ఆరుతడికి క్రమంగా దన్ను కలుగుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

? పట్టణంలోని చైతన్యనగర్, కళానగర్, కూరగాయల మార్కెట్, దుబ్బవాడ, వెల్లుల్ల రోడ్డులలో కుక్కలు గుంపుగుంపులుగా వచ్చి పాదచారులపై దాడులు చేస్తున్నాయి. **-రమేష్, కృష్ణ, గంగాధర్, సతీష్, ప్రవీణ్**
✔ కుక్కలను పట్టుకొని ఆపరేషన్ చేయిస్తున్నాం. దాడులు చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. **- మోహన్, కమిషనర్**

న్యూస్‌టుడే, రాయికల్ పట్టణం

? పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో కాలనీవాసులు ఇబ్బందుల పడుతున్నారు. **- శ్రీనివాస్, రాయికల్**
✔ ఎలక్ట్రీషియన్‌ను పురమాయించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- జగదీశ్వర్ గౌడ్, కమిషనర్**

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

? జగిత్యాల 8వ వార్డులో మురుగుకాలువలను శుభ్రం చేయనందున దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాము. **- వేణుగోపాల్**
✔ సిబ్బందిచే పరిశీలింపచేసి పారిశుద్ధ్య చర్యలను చేపడతాము. **- సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల**

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. మెట్‌పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే డిజిటల్ కార్డులో ఇంటి మహిళ యజమాని అని, ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలు పొందుపర్చడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి రేషన్ కార్డులు అందించకుండా పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకుల లింగారెడ్డి, జెట్టి లక్ష్మణ్, మార్గం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపు సజావుగా జరిగేలా చూడాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో దసరా ఉత్సవాల సందర్భంగా దేవుడి ఊరేగింపు(శవ) సజావుగా జరిగేలా చూడాలని వీడీసీ ఆధ్వర్యంలో పలు కుల సంఘాల సభ్యులు ఆదివారం ఎస్సై చిరంజీవికి విన్నవించారు. ఆదివారం పలు కుల సంఘాల సభ్యులంతా కలిసి మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి పోలీసులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 4న ప్రారంభమైన దేవుడి ఊరేగింపు 13 వరకు జరుగుతుందన్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారమే దేవుడి ఊరేగింపు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.


ఎస్సై చిరంజీవికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


మల్లాపూర్‌లో బీసీ ఐకాస ఆధ్వర్యంలో సమావేశమైన ప్రతినిధులు

బీసీ కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మల్లాపూర్, న్యూస్‌టుడే: బీసీ కుల గణన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జగిత్యాల జిల్లా బీసీ ఐకాస ఛైర్మన్ పుప్పాల లింబాద్రి కోరారు. మల్లాపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ బీసీలు కుల గణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల నుంచి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అక్టోబర్-9న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షలో పార్టీలకు అతీతంగా బీసీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మొరపు గంగారాజం, సిరిపురం రవీందర్, ముద్దం సత్యనారాయణగౌడ్, ప్రభాకర్, గజ్జి గంగారెడ్డి, గజ్జి రమేష్, రవీ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం సిరిపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం పాలకవర్గ సభ్యులు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సంఘానికి అటాచ్ చేసిన మాజీ సీఈవో వ్యవసాయ భూములను క్రమబద్ధీకరించడంతో పాటు అమ్మక్కపేటలో సర్వే నంబర్ 46, 47/ఒలోని 3 ఎకరాల భూమిని వేలంలో సొంతం చేసుకున్న ఎలేటి రాజరెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సహకార సంఘంలో నెలకొన్న సమస్యలను డీసీవో తక్షణమే పరిష్కరించేవరకు ఉద్యమిస్తామన్నారు. ఛైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.


సిరిపూర్‌లో ఒంటికాలుపై రిలేదీక్ష చేస్తున్న సభ్యులు


రాయికల్ పట్టణం: కుమారి పూజలో చిన్నారులు


మెట్‌పల్లి వెల్లుల్లో బోనాలతో శోభాయాత్ర


వేములకుర్తిలో శాకంబరిగా అమ్మవారు

ప్రత్యేక పూజలు.. బోనాలు

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి అలంకరణలు, కుంకుమార్చన, బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. **- న్యూస్‌టుడే యంత్రాంగం**


పెగడపల్లి మార్కండేయ ఆలయంలో..


ముత్యంపేటలో దుర్గా మండపం వద్ద కుంకుమ పూజ


కొడిమ్యాల: గాయత్రీదేవిగా..


మెట్‌పల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ


కోరుట్ల: బస్టాండ్‌లో మహిళా ఉద్యోగులు, ప్రయాణికులు


ధర్మపురి: గోదావరి తీరంలో బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబరాలు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పూలతో బతుకమ్మలను పేర్చి బస్టాండ్‌కు వచ్చిన మహిళా ప్రయాణికులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు.

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బస్టాండ్‌లో పెద్ద బతుకమ్మను ఏర్పాటు చేసి ఉద్యోగులతో పాటు ప్రయాణికులు కలిసి ఆడిపాడారు. డిపో మేనేజర్ దేవరాజ్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, నాగన్న, సురేష్, నగేష్, రాఘవ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: బతుకమ్మ పండుగను న్యూజిలాండ్‌లోని దక్షిణ కాంటర్‌బరీ ప్రాంతంలో ప్రవాస భారతీయులు వేడుకగా జరుపుకున్నారు. వేడుకల్లో జగిత్యాల జిల్లాలోని పలువురు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్లు గడికప్పుల శేఖర్, జమున, జలపెల్లి రంజిత్, ప్రవళిక తెలిపారు.


భూపతిపూర్‌లో 2003-04 పూర్వ విద్యార్థులు


కొడిమ్యాల: గురువులతో...

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

రాయికల్, న్యూస్‌టుడే: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2003-04లో పదో తరగతి పూర్వ విద్యార్థులు నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. జక్కుల చంద్రశేఖర్, మహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రామచంద్రం, శ్రీనివాస్, మధుసూధన్, కోటేశ్వర్‌రావు, గంగాధర్, రమేష్ తదితరులున్నారు.

కొడిమ్యాల: పూడూర్ గ్రామంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో 2013-14 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం ఆటపాటలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కరస్పాండెంట్ కాట్నపెల్లి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఉపాధ్యాయులు అహ్మద్, మధుసూదన్, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాలలోని గీతావిద్యాలయం 2004-05 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వారు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జరిపారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.


జగిత్యాలలో గీతావిద్యాలయంలో...

రాజ్యాంగ స్ఫూర్తిదాత అంబేడ్కర్

సారంగాపూర్: రాజ్యాంగ స్ఫూర్తిదాత అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగునూర్‌లో ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాంచందర్ రెడ్డి, మాలెపు సుధాకర్, శంకర్ రెడ్డి, పూడూరి శోభన్, బేర మహేష్, రాముడుగు రవి, వాసం శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రేమించిన వ్యక్తి అనుమానించాడని ఆత్మహత్య

ధర్మపురి గ్రామీణం, వెల్గటూరు, న్యూస్‌టుడే: ప్రేమించిన వ్యక్తి అనుమానించడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకొంది. స్థానిక ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం. . తీగలధర్మారానికి చెందిన గంధం గంగాభవాని(20) కరీంనగర్‌లో పీజీ రెండో సంవత్సరం చదువుతోంది. రెండేళ్లుగా వెల్గటూరు మండలం చర్లపల్లికి చెందిన ఓ యువకుడు, గంగాభవాని ప్రేమించుకుంటున్నారు. శనివారం ఇంటినుంచి బయటకు వెళ్లిన గంగాభవాని.. సాయంత్రం వరకు రాకపోవడంతో ఆమె తల్లి ఫోన్ చేసింది. తనను ప్రేమించిన వ్యక్తి అనుమానిస్తున్నాడని తల్లితో చెప్పింది. అతను పెళ్లికి నిరాకరించడంతో అదే రోజు సాయంత్రం గుల్లకోట శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి.. మెరుగైన చికిత్సకు కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తన కూమార్తె ఆత్మహత్యకు సదరు యువకుడే కారణమని తల్లి రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


గంగాభవాని

ఉరేసుకొని వ్యక్తి..

ఇబ్రహీంపట్నం: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని సత్తక్కపల్లి గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కి చెందిన కందేశ్ ప్రవీణ్(40).. మోర్తాడ్ నుంచి బస్సులో వచ్చి సత్తక్కపల్లి గ్రామశివారులో దిగాడు. వరద కాలువ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని, జీవితంపై విరక్తి చెందడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని, మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

దసరా ఆఫర్ల పేరుతో మోసం

● 8 మందిపై కేసు నమోదు

ధర్మపురి: దసరా ఆఫర్ల పేరుతో ప్రజలను మోసాలకు గురిచేస్తున్న 8 మందిపై ఆదివారం రాత్రి పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్సై మహేష్ పేర్కొన్నారు. పండుగ వేళలో ప్రజలు చీటీలు, ప్రైజ్ మనీల పేర్లతో పెట్టే ప్రకటనలను నమ్మవద్దని.. అలాంటివి ఎదురైతే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

సంక్షిప్తం

ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటుకు వినతి

సారంగాపూర్: మండలంలోని కొత్తపల్లి తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నర్సింహరెడ్డి, సత్యం రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని..

సారంగాపూర్: ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు విద్యాబోధనలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యాకమిషనర్ ఆకునూరి మురళిని జిల్లా ఎస్టీయూ సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. బైరం హరికిరణ్, రాజోజి భూమయ్య, పాలెపు రామక్రిష్ణ, రమేష్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా రేగొండ రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అక్కినపల్లి రాజయ్య, ఉపాధ్యక్షులుగా అనంతుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా అక్కినపల్లి రాము, కోశాధికారిగా గుండ రమేష్, సలహాదారులుగా కాసం వేణుగోపాలను నియమించారు. పాత రమేష్, సిరుప నాగభూషనం గుండ సురేష్, ఎలగందుల అశోక్, శ్రీనివాస్, మల్లేశం వ్యవహరించారు.

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల విద్యానగర్ మైసమ్మ గడ్డ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా గోస్కుల లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల రాజేందర్, కోశాధికారిగా అలిశెట్టి శంకర్, ఉపాధ్యక్షుడిగా ఇప్ప హరీష్, కార్యదర్శిగా కొక్కు లక్ష్మణ్, సభ్యులుగా కట్ట రాజేందర్, జంగిలి ధర్మేందర్, డిండిగాల శ్రీనివాస్, కాశెట్టి మధుకర్, సుంకరి రవి, సిద్ధం మురళి, వీర్నేని శేఖర్, గోపు రాజేశ్ ఎంపికయ్యారు.

సారంగాపూర్: తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లికి చెందిన పడిగెల రవీందర్‌రెడ్డిని నియమించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులను ప్రభుత్వాలు విస్మరించాయని, అందరిని ఏకం చేసి పోరాటం చేసేలా తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్

జగిత్యాల వాణిజ్యం: తల్లిదండ్రుల పోషణను విస్మరించి ఇంటినుంచి వెళ్లగొట్టిన పలువురికి జగిత్యాలలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యత, చట్టపరంగా తీసుకునే చర్యలను వివరించి తల్లిదండ్రులను వారివారి పిల్లలతో పంపించారు. అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రకాశ్, హన్మంతరెడ్డి, కరుణ, విఠల్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేట ఎస్సీ కాలనీలో శనివారం మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యం పాల్గొని ప్రసంగించారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పేదవర్గాల వారికి అందేలా చూస్తామన్నారు.

నేడు సమస్యల పరిష్కారానికి ధర్నా

సారంగాపూర్: సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను పంచాయతీ కార్మికులంతా కలిసి విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు పులి మల్లేశం, కొమటి చంద్రశేఖర్ కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగ భద్రతకు పోరాటం చేయాల్సిన అవసరముందని, జిల్లాలోని కార్మికులంతా తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

శ్రీసత్యానంద మహర్షి పుణ్యారాధన వేడుకలు

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం వేంపేటలో శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసత్యానంద మహర్షి 28వ పుణ్యారాధన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నగర సంకీర్తన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సింగరకొండ మాత శారదానంద భక్తులనుద్దేశించి మాట్లాడారు. మాజీ సర్పంచి మారంపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గాజంగి రాజమల్లయ్య పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

మెట్‌పల్లి పట్టణం: దసరాను సంతోషంగా జరుపుకోవాలని బల్దియా ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. మెట్‌పల్లిలో నితిన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు పురుషోత్తం, బుచ్చిరెడ్డి, గంగాధర్, మొరపు గంగాధర్, సత్యం, హనుమాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

చిల్వాకోడూర్(గొల్లపల్లి): స్థానిక శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన సాయిబాబకు దాత కందుకూరి పూర్ణచందర్-కవిత దంపతులు రూ.5 వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు.

దసరా ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి: బతుకమ్మ, విజయదశమి వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని స్థానిక సీఐ రవి పేర్కొన్నారు. మండలంలోని నంచర్ల రామాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన దేవీ విగ్రహ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సై రవికిరణ్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

వెల్గటూరు: ఎండపల్లి మండల పరిధిలోని గుల్లకోట ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ధర్మారంలోని సాయంపేటకు చెందిన సాయి అనే యువకుడు మృతిచెందాడు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

గోమాతకు జన్మదిన వేడుకలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్‌లో గోమాతకు పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు, గ్రామస్థుల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బైరవేని భాగ్యలక్ష్మీ-సత్యనారాయణ దంపతులు గతేడాది పుట్టిన లేగదూడకు బారసాల నిర్వహించి, శివ అనే నామకరణం చేశారు. ఏడాది పూర్తి చేసుకోవడంతో అర్చకుడు వొద్దిపర్తి సంతోషాచార్యుల ఆధ్వర్యంలో గోమాతను అందంగా అలంకరించి, మంగళహారతులతో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు.


గోమాత పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవస్వామి దర్శనం

శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని శ్రీచెన్నకేశవ స్వామి సూర్యప్రభ వాహనంపై ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి పుర వీధుల గుండా స్వామివారి రథాన్ని మేళతాళాలతో ఊరేగించారు. **- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**



కల్లుగీత కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో 100 మంది కల్లుగీత కార్మికులకు రూ.10 లక్షల విలువైన కాటమయ్య రక్షణకిట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ ఆదివారం పంపిణీ చేశారు. అంతర్గాం ఈత వనం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, సంక్షేమాధికారి సాయిబాబా, బాలుగౌడ్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, బాలముకుందం, ఆదిరెడ్డి, శేఖర్, ఆబ్కారీ అధికారులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.


రక్షణకిట్ ధరించిన కార్మికుడిని గమనిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

యువత క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలి

మల్యాల, న్యూస్‌టుడే: యువత క్రీడాస్ఫూర్తి అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మల్యాల అడ్డరోడ్డు సమీపంలో మూడు రోజులుగా పోలీసుల సహకారంతో జరుగుతున్న ఎం.ఎస్ క్రికెట్ పోటీలు శనివారం సాయంత్రం ముగియగా విజేత, రన్నర్ జట్లకు కప్పు అందించారు. సీఐ నీలం రవి, ఎస్సై నరేష్, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బొట్ల ప్రసాద్, సాగర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న డీఎస్పీ

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సారంగాపూర్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. సారంగాపూర్ మండలంలోని కోనాపూర్‌కు చెందిన తిరుకోవెల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఎస్‌కేఎన్ఆర్ 1994-97 డిగ్రీ మిత్ర బృందం రూ.45వేలు పోగు చేసి శ్రీనివాస్ భార్య, కూతురు ఇందుమతి, కుమారుడు అభిరాములకు ఆదివారం అందజేశారు. ఆరె శ్రీనివాస్, మోత్కూరి ప్రసాద్, గూడ మల్లారెడ్డి, సత్యం, సురేష్, కాంతారావు, నర్సయ్య, చందు, వైద్య వెంకటేష్, భీమన్న, పరాంకుశం శ్రీదీప్, లక్ష్మీనారాయణ, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఏకకాలంలో రుణమాఫీ చేశాం

మల్యాల, న్యూస్‌టుడే: రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మల్యాల మండలం పోతారం గ్రామంలో రూ.56 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ భవనాన్ని ఎమ్మెల్యే సత్యంతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఏవైనా కారణాలవల్ల రూ.2లక్షల రుణమాఫీ జరగని రైతులందరికీ కూడా మాఫీ వర్తించేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని వివరించారు. సింగిల్‌విండో అధ్యక్షులు సాగర్‌రావు, మధుసూదన్‌రావు, రాంలింగారెడ్డి, సత్యంరావు, వేణురావు, మల్లికార్జున్‌రెడ్డి, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, పాలవర్గం సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


మైతాపూర్‌లో బోనాలతో తరలివస్తున్న మహిళలు

ఘనంగా బోనాల పండుగ

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలంలోని బోర్నపల్లి, మైతాపూర్, ఆలూరు తదితర గ్రామాల్లో దేవి నవరాత్రుల సందర్భంగా ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనంతో గ్రామంలోని పోచమ్మ ఆలయం నుంచి దేవి మండపాల వరకు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని ఎస్సై సందీప్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి విలేజ్ టూ విలేజ్ నైట్ సర్కిల్ ఒక్క రోజు క్రికెట్ పోటీలు జీజీ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించగా ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. నాగార్జున, బత్తిని సుమంత్, అర్షనపెల్లి శివ, గుడిపెల్లి మహర్షి, విలాసాగర్ మనోజ్, చొక్కాల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై సందీప్

నూలు డిపో ఏర్పాటుపై సంబరాలు

మేడిపల్లి, న్యూస్‌టుడే: వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేస్తూ రూ.50 కోట్లు కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు మేడిపల్లిలో ఆదివారం పద్మశాలి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. నూలు(యారన్) డిపో ఏర్పాటుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరమగ్గాల నేత కార్మికులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. ఏనుగు రమేశ్ రెడ్డి, చేపూరి నాగరాజు, శ్రీపతి దామోదర్, బండారి రమేశ్, మ్యాకల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడి ఊరేగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవంలో ఆదివారం రాత్రి సూర్యప్రభ వాహనంపై నారసింహున్ని పుర వీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, మహిళలు, భక్తుల నడుమ.. దేవస్థానం నుంచి పలు వీధుల్లో ఊరేగించి, ఇసుకస్తంభం వద్దకు చేర్చారు. స్వామివారికి పూజలు నిర్వహించి తిరిగి దేవస్థానానికి చేర్చారు. ఆలయ ఈవో శ్రీనివాస్ వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. దేవస్థానానికి ఆదివారం రూ.1,69,115 ఆదాయం సమకూరింది.


స్వామివారి సూర్యప్రభ సేవ